క్లుప్తంగా

నీటి సంరక్షణ అందరి బాధ్యత



పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గండేపల్లి: నీటి సంరక్షణకు అందరూ బాధ్యత వహించాలని స్కూల్ హెచ్‌ఎం ఎం.చినరాజు పిలుపునిచ్చారు. చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పి.నాయకంపల్లి హైస్కూల్‌లో మృత్తికలు, నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నీటిని సంరక్షించుకోవడంతో పాటు మృత్తికలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిత్తడి నేలలు వరద నియంత్రణకు సహకరిస్తాయన్నారు. చిత్తడి నేలల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీవీ సత్యనారాయణ, టి. వీరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటింటి ప్రచారం

జగ్గంపేట: యోగి వేమన జయంతిని పురస్కరించుకుని వేమన పద్యాలలోని జ్ఞానం ఆవశ్యకతపై నిర్వహించిన ఇంటింటి ప్రచారం శనివారంతో ముగిసిందని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్ బాబు తెలిపారు. జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, రంగంపేట, పెద్దాపురం మండలాల్లోని 21 గ్రామాల్లో ఈ ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దవులూరి సత్యనారాయణ భరత్, బి.శాంతరాజు, మూర్తి స్వామి నాయుడు, కె.అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు-వేల గొంతులు' విజయవంతం చేయాలి

తుని: ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నాంగి నాగరాజు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర సమావేశాలు ముగించుకొని శనివారం హైదరాబాద్ వెళ్తున్న ఆయనకు మాదిగ రక్షణ పోరాట సమితి నాయకులు తుమ్మలపల్లి కుమార్, గంపల బాబూరావు, డప్పు కళాకారులు ద్రాక్షారపు రాజేష్, మోర్త తేజ జాతీయ రహదారిపై సీతారామపురం జంక్షన్ వద్ద స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. టీఎల్ఆర్ఎస్ సమితి ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన డప్పులను నాగరాజు చేతుల మీదుగా డప్పు కళాకారులకు అందజేశారు.

వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా రఘు



రఘును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కిర్లంపూడి: స్థానిక వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్‌గా నైదాన రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ సభ్యులు శనివారం ఆయనను క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. విశ్రాంతి ఉద్యోగి పెంటకోట మూర్తి ఆధ్వర్యంలో రఘు నివాసానికి వాకర్స్ క్లబ్ సభ్యులు వెళ్లి శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైస్‌చైర్మన్ ఎన్నికకు మీడియాకు అనుమతి

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం జరిగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మీడియాకు అనుమతి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరావు శనివారం తెలిపారు. వైస్‌చైర్మన్ ఎన్నికకు హాజరయ్యే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ జారీ చేసిన అనుమతి పత్రం లేదా ఐడెంటిటీ కార్డు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

93.04 శాతం పింఛన్ల పంపిణీ

గండేపల్లి: మండలంలోని తొలిరోజు శనివారం 93.04 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలపారు. మండల వ్యాప్తంగా 8365 మంది లబ్ధిదారులకు గాను 7783 మందికి పెన్షన్ అందజేసినట్టు వివరించారు.

17న శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ

జగ్గంపేట: ఏలేరు నదితీరమైన ఇర్రిపాక గ్రామంలో ఈ నెల 17న శివకేశవుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలో శనివారం విగ్రహాల ప్రతిష్ఠ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి పార్థీవ శివలింగాలను నిక్షిప్తం చేసిన ప్రాంతంలో శివకేశవుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 12వ తేదీ నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభవుతాయని తెలిపారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నామని, భక్తులు భారీగా తరలివచ్చి ఈ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో స్థానిక నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల మోత

- దొడ్డిదారిలో సర్కారు నిలువు దోపిడీ
- ప్రకటనలు లేకుండా యూనిట్ ధర పెంపు
- ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో రెట్టింపు వడ్డన
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



కోటనందూరులో విద్యుత్ సబ్‌స్టేషన్

కోటనందూరు: అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం మోపుతూ వస్తోంది. దీనిలో భాగంగానే ఎస్సీ వినియోగదారుల నుంచి ముక్కుపిండి బకాయిలు వసూలు చేస్తోంది. బకాయిలు చెల్లించడంలో ఆలస్యం చేస్తే వారి విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్నారు.

వినియోగదారులపై అదనపు భారం

తాజాగా ఎటువంటి ప్రకటనలు చేయకుండా దొడ్డిదారిన యూనిట్ చార్జీ పెంచేసి వినియోగదారుల నడ్డి విరిచింది కూటమి ప్రభుత్వం. దీనికి అదనంగా ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్టుమెంట్ చార్జెస్ (ఎఫ్‌పీపీసీఏ) -1, 2, 3 పేరుతో వినియోగించిన దానికి రెండు రెట్లు బిల్లు వేసి మోయలేని భారాన్ని వినియోగదారుడి నెత్తిపై పెట్టింది. డిసెంబర్ నెలలో రూ.300 వచ్చిన కరెంట్ బిల్లు జనవరి నెలలో రూ.800 వచ్చిందంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ చార్జీలు ఏ ప్రాతిపదికన పెరిగాయనే ప్రశ్నకు కనీసం ఆ శాఖ సిబ్బంది దగ్గర కూడా సమాధానం లేని విధంగా సర్కారు చార్జీల మోత మోగిస్తోంది. ఈ దుస్థితి పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వ తీరు పట్ల వినియోగదారులు మండి పడుతున్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

17 వేల కనెక్షన్లు

కోటనందూరు మండలంలో 17 పంచాయతీలకు సంబంధించి కోటనందూరు, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో కేటగిరి-1 నుంచి కేటగిరి-5 వరకూ సుమారుగా 17 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో రాయితీ లేని గృహ, వ్యాపార, ఇండస్ట్రీ వినియోగదారులపై చార్జీల పెరుగుదల ప్రభావం తీవ్రంగా పడుతోంది. నెలనెలా పెరిగి వస్తున్న విద్యుత్ బిల్లులను చూసి వినియోగదారులు మూర్ఛపోతున్నారు.

అక్రమ వినియోగ ప్రభావం

పల్లెల్లో జరుగుతున్న అక్రమ విద్యుత్ వినియోగం వల్ల నిజమైన వినియోగదారులపై సర్కారు మోపిన భారానికి అదనంగా భారం పడుతోంది. కోళ్లఫారాలు, వ్యాపార దుకాణాలు, ఇండస్ట్రీలతో పాటు గృహ వినియోగంలో కూడా అక్రమ విద్యుత్ వినియోగం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాల్లో ప్రధానంగా విద్యుత్ సిబ్బంది వెనుక తిరిగే ఎలక్ట్రీషియన్లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి విద్యుత్ ఉద్యోగి వారి విధి నిర్వహణలో అవసరాలను బట్టి గ్రామాల్లోని ఎలక్ట్రీషియన్లను వినియోగించుకుంటున్నారు. ఇదే అదనుగా ఎలక్ట్రీషియన్లు తమకు తిరుగులేదని రెచ్చిపోతున్నారు. వినియోగదారుల నుంచి భారీగా డబ్బులు గుంజేసి విద్యుత్ అక్రమ వినియోగానికి బాటలు పరుస్తున్నారు. ఈ వ్యవహారంలో విద్యుత్ సిబ్బంది కళ్లను సైతం కప్పేయడం గమనార్హం. విద్యుత్ పరంగా ఏమాత్రం సమస్య తలెత్తినా దానిని పరిష్కరించుకోవడం వినియోగదారులకు తలకు మించిన భాగంగా మారింది.



డిసెంబర్ నెలలో రూ.374 వచ్చిన బిల్లు జనవరి నెలలో రూ. 574

బిల్లుల పెంపు అన్యాయం



విద్యుత్ బిల్లులను చూసి సామాన్య వినియోగదారుడు బెంబేలెత్తిపోయే పరిస్థితి వచ్చింది. ప్రతి నెలా ఏవో చార్జీల పేరుతో కరెంట్ బిల్లులు పెంచుతూనే ఉన్నారు. ఇది చాలా అన్యాయం. ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి తప్ప వినియోగదారులపై మోయలేని భారాన్ని వేయడం మంచిది కాదు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి వినియోగదారుడికి ఊరట కలిగించాలి. **అప్పలనాయుడు**, వినియోగదారుడు, కేఈ చిన్నయ్యపాలెం

మహాకుంభమేళాకు ఆర్టీసీ బస్సు సర్వీసు



గోకవరంలో మహాకుంభమేళా బస్సుసర్వీసును ప్రారంభిస్తున్న డీఎం రామన్న, సిబ్బంది

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మహాకుంభమేళాకు శనివారం ప్రత్యేక బస్సు బయలుదేరి వెళ్లింది. ఈ బస్సు సర్వీసును డిపో మేనేజర్ యు.రామన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో భక్తులు భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా, వారణాశి, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణి సంగమం క్షేత్రాలు దర్శించుకుంటారన్నారు. యాత్రికులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఆహార వసతి కల్పిస్తునట్టు తెలిపారు. యాత్రికులు ఈ నెల 8న గోకవరం చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గండేపల్లి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నాతి బుజ్జి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లెపండుగ పేరిట జరుగుతున్న సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సత్తెమ్మతల్లి జాతర ప్రారంభం



ప్రత్తిపాడులోని సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఆకట్టుకున్న పుష్పాలంకరణ

ప్రత్తిపాడు: గ్రామంలో వేంచేసిన సత్తెమ్మతల్లి అమ్మవారి 46వ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక రాజుగారి వీధిలోని ఆలయానికి అమ్మవారిని కొత్తపేట నుంచి కంఠస్ఫూర్తి వంశీకులు మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ తీసుకువచ్చారు. అమ్మవారి ఆలయంలో గద్దెపై ప్రతిష్ఠించి పిలిపే ఉత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి జి.రాగంపేటకు చెందిన కుండల సూరిబాబు బృందంతో వెంకన్నబాబు కథ ప్రదర్శించారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

సత్తెమ్మతల్లి జాతరను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు తిరనాళ్లు నిర్వహిస్తారు. పొద్దుపోతే చాలు సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి ఆలయం వద్ద సందడి నెలకొంటుంది. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి షణ్ముఖి నాట్యమండలి వారితో శ్రీరామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్రదర్శిస్తారు. 3వ తేదీ రాత్రి నాట్య విభావరి, పూలగరగ సంబరం, 4వ తేదీ రాత్రి శ్రీసత్య ఆర్కెస్ట్రా సంగీత విభావరి, చివరి రోజు 5వ తేదీ బుధవారం బాణసంచా కాల్పులు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా సాగనంపుతారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

మాజీ మంత్రి ముద్రగడ దృష్టికి సాగునీటి సమస్య



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభాన్ని కలసిన రైతులు

కిర్లంపూడి: ప్రత్తిపాడు మండలం రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లోని సాగునీటి ఎద్దటిని పరిష్కరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభంను రైతులు కోరారు. రెండు గ్రామాల నుంచి సుమారు 50 మంది రైతులు శనివారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సాగునీటి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లోని సుమారు 7 వేల ఎకరాల్లో పంట సాగునీటి ఎద్దడి కారణంగా ఎండిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. ఈ రెండు గ్రామాల మీదుగా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్ట్ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ వెళ్తున్న ఏలేరు జలాలను తమ పొలాలకు అందించటానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రామిశెట్టి నాని, ఏనుగు శ్రీను, సారిపల్లి గంగరాజు, కొప్పన గంగారావు, సూరవరపు ఏసుబాబు, రామకుర్తి వెంకన్నబాబు, సుంకర వెంకన్న, రామిశెట్టి చంద్రబాబు, సాదనాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



భీష్మ ఏకాదశి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: రత్నగిరిపై ఈ నెల 8న భీష్మ ఏకాదశి, 12న మాఘ పౌర్ణిమ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించి అన్నవరం దేవస్థానం ముద్రించిన వాల్ పోస్టర్‌ను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. ఈ పర్వదినాల్లో సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. దేవస్థానం పీఆర్వో వి.కృష్ణారావు, ఈఈ రామకృష్ణ, సూపరింటెండెంట్ ఐవీ రామారావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జగ్గంపేటలో లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జగ్గంపేట: లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా మారిశెట్టి రాధాకృష్ణ, అధ్యక్షుడిగా దవులూరి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మందపాటి కృష్ణవర్మ, సెక్రటరీగా సిగిరెడ్డి రాంబాబు, జాయింట్ సెక్రటరీలుగా సుంకర శ్రీనివాసరావు, కొలుకులూరి వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

కోటనందూరు: స్థానిక పోలీసుస్టేషన్ వద్ద బొద్దవరం గ్రామస్తులకు శనివారం సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై టి.రామకృష్ణ మాట్లాడుతూ నేరాల నిరోధంలో సీసీ కెమెరాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. బొద్దవరం సెంటర్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని ఎన్టీ రాజాపురానికి చెందిన బి.అనామిక (29) మానసిక దివ్యాంగురాలు కావడంతో తల్లి, భర్త కూలి పనికి వెళుతుండగా ఆమె ఇంటి వద్దే ఉంటున్నారు. గత నెల 24న హారతి వెలిగించి స్వామివారికి దండం పెట్టుకుంటుండగా ఒంటిపై దుస్తులు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఆమె కేకలు వేయడంతో పక్కింటి మహిళ చూసి స్థానికుల సాయంతో మంటలను ఆర్పి వేశారు. తీవ్ర గాయాల పాలైన ఆమెను హాస్పటల్‌కు తీసుకువెళ్లకుండా ఇంటి వద్దే పసరు మందు వేయడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆమెకు వాంతులు అవ్వడంతో గత నెల 28న కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా 31వ తేదీ రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

కిర్లంపూడి: రాజుపాలెం నుంచి గోనేడ మీదుగా రామవరం వెళ్లే ప్రధాన రహదారి, తామరాడలోని పలు సిమ్మెంట్ రోడ్ల అభివృద్ధి పనులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ శనివారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణ పనుల్లో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ తోట రవి పాల్గొన్నారు.

మాదిగల ప్రదర్శనను విజయవంతం చేయాలి

రౌతులపూడి: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ మండల మాదిగ సామాజిక సంఘం పిలుపు నిచ్చింది. ఈ మేరకు శనివారం రౌతులపూడిలో ఆ సంఘ సభ్యులు సమావేశం నిర్వహించారు. వర్గీకరణ అమలు కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ సూరరాజు, జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజారంజక బడ్జెట్

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రజారంజకమైన బడ్జెట్ అని కాకినాడ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు, చార్టెడ్ ఎకౌంటెంట్ చిలుకూరి రామ్‌కుమార్ అభివర్ణించారు. ప్రత్తిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపు మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో ఊరట నిచ్చే అంశమన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఉత్పత్తి - ఉపాధి కల్పనకు, విద్యా వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన కేటాయింపులు వృద్ధి రేటును మరింత పెంచుతాయన్నారు. గ్రామీణ, చిన్న పట్టణాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడం ద్వారా గ్రామీణ యువత ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వెళ్లే అవసరం ఉండదని చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

శంఖవరం: రబీలు పంటలు సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. రబీలో వరి, అపరాలు సాగు చేసే రైతులు, కౌలు రైతులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పంట కోత ప్రయోగాలు, పీఎం కిసాన్, జాతీయ ఆహార భద్రతా మిషన్, పంటల బీమా, ఎరువుల ప్రాధాన్యం తదితర అంశాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం అపరాలు పూత దశలో ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వైర్లు చోరీ చేసిన వ్యక్తుల అరెస్ట్

గండేపల్లి: పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు వైర్లు దొంగిలించిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...గండేపల్లి మండలంలోని సూరంపాలెం, మల్లేపల్లి, మురారి, పి.నాయకంపల్లి, సుబ్బయమ్మపేట గ్రామాల్లోని పొలాల వద్ద విద్యుత్ తీగలు, మోటార్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ వైర్ల చోరీకి పాల్పడిన నీలాద్రిరావుపేటకు చెందిన వి.నాగరాజు, జగ్గంపేటకు చెందిన సీహెచ్ జోగిరెడ్డిలను గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ చేసిన వైర్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. శనివారం రాత్రి విశాఖపట్నం నాట్యపరిమళ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా దాడిశెట్టి విష్ణుచక్రం, దండెం రామకృష్ణ, సత్యరాజ్ సంగీతాలయం వ్యవస్థాపకులు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వై.బాలగణేష్ పాల్గొని ప్రదర్శనలు, కళాకారులను అభినందించారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మీడియా సమావేశంలో వెంకన్న బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 65వ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3న ప్రారంభమై 9వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. గోకవరం నుంచి తంటికొండ రోడ్డు నిర్మాణ పనులు, కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలతో పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి సీతారామయ్య, గండిపూడి శ్రీధర్, బద్దిరెడ్డి దామోదర్, చింతల నాగు, తోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.26 వేల ఆర్థిక సాయం



డిజిటల్ లావాదేవీ ద్వారా యువతి చికిత్సకు ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీనివాసరావు

గోకవరం: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ యువతికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.26 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన బడుగు దీపిక అనే యువతి రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఆమె గోకవరం కళాభారతి నృత్య పాఠశాలలో నాట్యం నేర్చుకుంటోంది. ఇటీవల ఆమె కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రావును సంప్రదించడంతో శనివారం గోకవరంలో ఆమె చికిత్సకు రూ.26 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావుశర్మ, కట్టా కల్యాణ్, దాసరి ధర్మరాజు, మందపాటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ సురేష్

ఏలేశ్వరం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యల్‌హెచ్‌ఓ మేనేజర్లు సురేష్, ఏలీషానాయుడు తెలిపారు. మండలంలోని యర్రవరంలో శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకురాలు రమాప్రభ ఆధ్వర్యంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 44 రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులకు అందిస్తున్నట్టు తెలిపారు. రైతులకు రుణాలతో పాటు పలు సేవల లావాదేవీలకు 18001234 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైరాల కనకరావు, తోట వెంకటేశ్వరరావు, తోట దుర్గారావు, బీశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఏలేశ్వరం: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. పట్టణంలోని భాష్యం స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఇంట్రా సబ్‌జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఏలేశ్వరంతో పాటు తుని, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేట పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. క్రీడల ద్వారా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే తత్వం ఏర్పడుతుందన్నారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అలవాటు చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. తొలుత డీఎస్పీ శ్రీహరిరాజు విద్యార్థులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై రామలింగేశ్వరరావు, తుని, పిఠాపురం, జగ్గంపేట బ్రాంచిల ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్, వేణు, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

తుని: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మాదిగ, ఉపకులాలను ఎ, బి, సి, డిలుగా విభజించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో పలివెల శివమణి ఆధ్వర్యంలో శనివారం ఎ, బి, సి, డి వర్గీకరణపై మాదిగలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణతో దళితులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. దళితులందరికీ మంచి జరిగే వర్గీకరణను తక్షణమే అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. దళితుల రిజర్వేషన్‌ను 50 శాతం నుంచి 80 శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో జాతీయ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఏడిద వరప్రసాద్, పలివెల సతీష్, దల్లి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.